సాక్షి సిద్దిపేట

గురువారం । 3 । ఆగస్టు । 2023



108 సేవలు.. మరింత వేగం

మంత్రి హరీశ్‌రావు కృషితో జిల్లాకు అత్యాధునిక టెక్నాలజీతో పాటు రోగికి తక్షణ వైద్య నదుపాయాలు అందించేందుకు 15 నూతన 108 వాహనాలు కేటాయించారు. 8లో..



ఆశ చూపి దోచేస్తున్నారు

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం, ఉద్యోగాలు, ప్రకటనల పేరుతో వివిధ రకాలుగా ఆశ చూపుతూ సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో డబ్బులు దోచుకుంటున్నారు. 8లో..



ప్రారంభోత్సవానికి సిద్ధం 9లో..

గ్రామీణ ప్రజలకు వైద్యసేవలను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అక్కన్నపేట మండలంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు ప్రారంభానికి ముస్తాబవుతున్నాయి.

న్యూస్‌రీల్

సృజనాత్మకతను వెలికి తీయాలి



మాట్లాడుతున్న అధికారి భాస్కర్

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా సెక్టోరియల్ అధికారి బి.భాస్కర్ అన్నారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా మౌళిక భాషా గణిత సామర్థ్యాల సాధన కార్యక్రమంపై మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక విద్య ముగిసేలోపు మౌళిక భాషా గణిత సామర్థ్యాలపై విద్యార్థులు పట్టు సాధించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ జోగు ప్రభుదాసు, స్కూల్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ కొత్త రాజిరెడ్డి, మండల నోడల్ అధికారులు అంజిరెడ్డి, చక్రపాణి, ఆర్పీలు కె. వెంకట నర్సింహులు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యువత సంక్షేమానికి కృషి



ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లు అందిస్తున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: యువత సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్‌లోని సీఎం మినీ క్యాంపు కార్యాలయంలో 250 మంది యువకులకు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు అందించారు. అదేవిధంగా జగదేవ్‌పూర్ మండలం మునిగడప గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న 'స్వచ్ఛ సర్వేక్షణ్' ఫీడ్ బ్యాక్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

సిద్దిపేటకమాన్: హైదరాబాద్‌లో ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్న యాదవ గర్జన సభను విజయవంతం చేయాలని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు రాములు అన్నారు. బుధవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన యాదవులకు అన్ని పార్టీలు టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వంశీ, రాములు, చంద్రశేఖర్, హరీశ్, రాజు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న గోపాల స్వామి

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి విమర్శించారు. మిరుదొడ్డిలో గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు బుధవారం ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. సర్కార్ జీవో 51ని తీసుకొచ్చి కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించే వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల పక్షాన ఉద్యమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మద్దెల అంజయ్య, సురేందర్, మైసయ్య, చంద్రయ్య, శ్యామల, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సిద్దిపేటకమాన్: యాదవ హక్కుల పోరాట సమితి సిద్దిపేట జిల్లా కమిటీని స్థానిక ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రాగుల వెంకటేశం యాదవ్, యువజన అధ్యక్షుడిగా గొర్రె హరీశ్ యాదవ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వంశీమోహన్, చంద్రం, కనకయ్య, కృష్ణ పాల్గొన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం

- ఈవీఎంల మొదటి విడత తనిఖీలు పూర్తి
- ఇప్పటికే అడిషనల్ కలెక్టర్, ఆర్‌డీఓ, తహసీల్దార్ల బదిలీలు
- ఎన్నికల నిర్వహణ కోసం ఉద్యోగుల వివరాల సేకరణ
- జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో 1,132 పోలింగ్ కేంద్రాలు
- నేడు రాజకీయ పార్టీలతో కలెక్టర్ సమావేశం

అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా గడువు ఉన్నప్పటికీ జిల్లాలో అప్పుడే హడావుడి మొదలైంది. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే అధికారుల బదిలీలు, ఓటరు జాబితా తయారీ, ఈవీఎంల తనిఖీ, కొత్తగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర ప్రక్రియలు జోరుగా సాగుతున్నాయి.

సాక్షి, సిద్దిపేట : త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తుంది. ఇప్పటికే జిల్లా ఎన్నికల అధికారి, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్(ఏఆర్‌ఓ)అధికారుల నియామకం పూర్తికాగా, ఓటింగ్ యంత్రాల మొదటి స్థాయి తనిఖీ ప్రక్రియ పూర్తి చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అడిషనల్ కలెక్టర్, ఆర్‌డీఓ, తహసీల్దార్ల బదిలీలు పూర్తయ్యాయి. జిల్లాలో ఓటర్ల తుది జాబితా తయారీకి ఇప్పటికే ప్రక్రియను ప్రారంభించగా నూతన ఓటర్ల నమోదు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లాకు బ్యాలెట్ యూనిట్‌లు 2,310, కంట్రోల్ యూనిట్‌లు 1,878, వీవీప్యాడ్‌లు 1,845 రాగా, వాటిని కొండపాకలోని గోదాంలో భద్రపరిచారు.

పోలింగ్ కేంద్రాల వివరాలు	
నియోజకవర్గం	సంఖ్య
సిద్దిపేట	257
గజ్వేల్	316
హుస్నాబాద్	306
దుబ్బాక	253

రిటర్నింగ్ అధికారుల నియామకం

జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల రిటర్నింగ్ అధికారులను రాష్ట్ర ఎన్నికల అధికారి ఇటీవల నియమించారు. సిద్దిపేట నియోజకవర్గానికి ఆర్‌ఓ సిద్దిపేట ఆర్‌డీఓ రమేష్, దుబ్బాకకు అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్, గజ్వేల్‌కు బన్సీలాల్, హుస్నాబాద్‌కు బెన్‌శాలెంలను నియమించారు. అలాగే మండల తహసీల్దార్‌లను అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్(ఏఆర్‌ఓ)గా నియమించారు. ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఈవీఎంలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే నాలుగు ప్రచార రథాలను ఏర్పాటు చేసి ఈవీఎం లపై అవగాహన కల్పిస్తున్నారు.



గజ్వేల్ ఆర్‌డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈవీఎంలపై అవగాహన శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్(ఫైల్)

వివరాల సేకరణ

జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల నుంచి 44 అంశాలతో కూడిన వివరాలు సేకరించి ప్రత్యేక ఫార్మట్‌లో అప్‌లోడ్ చేయాలని ఇప్పటికే అన్ని శాఖలకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉద్యోగి ఐడీ నంబర్, హోదా, ఏ శాఖ, ఏ నియోజకవర్గం పరిధిలో పనిచేస్తున్నారు. పోలింగ్ సమయంలో ఏ నియోజకవర్గంలో ఉంటారు.. సొంత గ్రామం ఏ నియోజకవర్గం పరిధిలో వస్తుంది, ప్రస్తుత, శాశ్వత చిరునామాలు, ఈ మెయిల్, బంధుత్వం, దివ్యాంగులా..? వంటి వ్యక్తిగత సమాచారం సేకరిస్తున్నారు. గత ఎన్నికల్లో ఏ పోలింగ్ కేంద్రంలో ఏ హోదాలో విధులు నిర్వహించారు. ఉద్యోగి ఐడీ కార్డు, నేరచరిత్ర ఉందా? బ్యాంకు ఖాతా వివరాలు తదితర అంశాలు ఈ ఫార్మాట్‌లో ఉన్నాయి. వాటి ప్రకారం ఉద్యోగులు అన్ని వివరాలను పొందుపరుస్తున్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల వివరాలు సేకరిస్తున్నారు.

ఈవీఎంల టెస్టింగ్ పూర్తి

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణకు సమాయత్తం అవుతున్నాం. ఇప్పటికే మొదటి విడత ఈవీఎంల టెస్టింగ్ పూర్తయింది. నియోజకవర్గ కేంద్రాల్లో ప్రజలకు వీటిపై అవగాహన కల్పిస్తున్నాం. అలాగే నాలుగు మొబైల్ వాహనాలను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. **-అబ్దుల్లా, ఏఓ, కలెక్టరేట్**

1,132 పోలింగ్ కేంద్రాలు

జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో 1,132 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1,400 కు మించి ఓటర్లు ఉండొద్దని ఎన్నికల సంఘం నిబంధన పెట్టింది. దీంతో జిల్లాలో పోలింగ్ కేంద్రాలు పెరిగే అవకాశం ఉంది. గురువారం(నేడు) ఉదయం 11గంటలకు కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీలతో కలెక్టర్ సమావేశం నిర్వహించనున్నారు. అవసరమైన కొత్త పోలింగ్ కేంద్రాలపై నాయకులతో చర్చించనున్నారు.

విధులు బాధ్యతగా నిర్వర్తించాలి

దుబ్బాకటౌన్: అధికారులు ఎన్నికల విధులు బాధ్యతతో నిర్వర్తించాలని అడిషనల్ కలెక్టర్, దుబ్బాక నియోజకవర్గ ఆర్‌ఓ గరిమా అగర్వాల్ సూచించారు. బుధవారం దుబ్బాక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ తహసీల్దార్లు, ఎంపీడీఓలతో ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు ప్రక్రియపై చర్చించారు. అనంతరం గత ఉప ఎన్నికల్లో వినియోగించిన మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్‌లోని ఎన్నికల స్ట్రాంగ్ రూంను ఆమె పరిశీలించారు. అలాగే పట్టణంలోని మార్కెట్ యార్డు, నూతనంగా నిర్మిస్తున్న ఐఓసీ భవనాలను స్ట్రాంగురూంల ఏర్పాటు కోసం పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్ పాతూరి గణేష్‌రెడ్డి, తహసీల్దార్ సలీమియా, ఎంపీడీవో భాస్కరశర్మ ఉన్నారు.



దుబ్బాక మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్

నిజాయితీగా విధులు నిర్వర్తిస్తే గుర్తింపు

పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత

సిద్దిపేటకమాన్: నిజాయితీగా విధులు నిర్వహించే ప్రతి ఒక్కరినీ ప్రజలు గుర్తుంచుకుంటారని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. అడిషనల్ డీసీపీ (అడ్మిన్) మహేందర్ సంగారెడ్డి అడిషనల్ ఎస్పీగా బదిలీపై వెళుతున్న సందర్భంగా పోలీసు కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం రాత్రి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీ ముఖ్యఅతిథిగా హాజరై అడిషనల్ డీసీపీ సేవలను కొనియాడారు. జిల్లాను విడిచి వెళుతున్నందుకు బాధగా ఉందని మహేందర్ అన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

సిద్దిపేట అడిషనల్ డీసీపీ (లా అండ్ ఆర్డర్) గా యస్.మల్లారెడ్డి, అడిషనల్ డీసీపీ (అడ్మిన్)గా అందె శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. వీరితోపాటు సిద్దిపేట పోలీసు కమిషనరేట్‌లో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లుగా టి.శ్రీనివాస్, పూర్ణచందర్ బాధ్యతలు స్వీకరించారు. వీరంతా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ శ్వేతను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు.



సీపీ శ్వేతకు మొక్కను అందజేస్తున్న అడిషనల్ డీసీపీ (లాఅండ్ ఆర్డర్) మల్లారెడ్డి

నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్

పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని సీపీ శ్వేత తెలిపారు. ఆగస్టు 10వ తేదీ వరకు నిబంధనలు అమలులో ఉంటాయని తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ధర్నాలు నిర్వహించరాదని సూచించారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

మిరుదొడ్డి(దుబ్బాక): కష్టపడి చదవాల్సిన యుక్త వయసులో చెడు అలవాట్లకు బానిసలు కావొద్దని సీపీ శ్వేత అన్నారు. మండల కేంద్రం మిరుదొడ్డిలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులకు షీ టీం, మహిళల రక్షణ చట్టాలు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, యాంటీ హ్యూమెన్, ట్రాఫికింగ్ గుడ్ టచ్ బ్యాడ్ టచ్ తదితర అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, మిరుదొడ్డి ఎస్‌ఐ నరేష్, ప్రిన్సిపాల్ భారతీదేవి పాల్గొన్నారు.

కొత్త తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

జిల్లాలో మరో ఆరుగురు బదిలీ

సాక్షి, సిద్దిపేట: జిల్లాలో మంగళవారం బదిలీ అయిన పది మంది తహసీల్దార్‌లతోపాటు మరో ఆరుగురిని బదిలీ చేస్తున్నట్లు బుధవారం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇతర జిల్లాల నుంచి బదిలీ పై జిల్లాకు వచ్చిన పది మంది తహసీల్దార్‌లకు కలెక్టర్ పోస్టింగ్‌లు ఇచ్చారు. నంగనూరు తహసీల్దార్ దిలీప్‌నాయక్ సిద్దిపేట అర్బన్‌కు బదిలీ అయ్యారు. దుబ్బాక నుంచి సలీంమియా సిద్దిపేట రూరల్‌కు, చేర్యాల నుంచి ఆరిఫా గజ్వేల్ ఆర్డీఓకు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ అహ్మద్‌ఖాన్ హుస్నాబాద్ ఆర్డీఓ కార్యాలయ ఏఓగా బదిలీ అయ్యారు. కొండపాక తహసీల్దార్ రామేశ్వర్ కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా వచ్చారు. తొగుట డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న జహీర్ రాయపోల్ తహసీల్దార్‌గా(ఎఫ్ఏసీ) బదిలీ అయ్యారు.

ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారికి పోస్టింగ్‌లు	
మండలం	పేరు
కోహెడ	సురేఖ
తొగుట	శ్రీనివాసరావు
బెజ్జంకి	వెంకట్ రెడ్డి
దుబ్బాక	జయంత్
మద్దూరు	సీహెచ్ శ్రీనివాస్
మర్కూక్	చంద్రశేఖర్ రావు
చేర్యాల	హరికృష్ణ
హుస్నాబాద్	రవీందర్ రెడ్డి
నంగనూరు	అనిల్ కుమార్
మిరుదొడ్డి	గోవర్ధన్

పురోగతి లేనప్పుడు నేనెందుకు?



హుస్నాబాద్‌లో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

పనుల జాప్యంపై కలెక్టర్ సీరియస్

హుస్నాబాద్: పట్టణంలోని ఐఓసీ నిర్మాణ పనులు, మోడల్ స్కూల్ ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ బుధవారం పరిశీలించారు. ఐఓసీ భవన నిర్మాణ పనుల జాప్యంపై అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 రోజులుగా ఎలాంటి పనులు జరగకపోవడంపై మండిపడ్డారు. కలెక్టర్ ఆదేశాలను కూడా బేఖాతరు చేస్తారా అని ప్రశ్నించారు. పురోగతి లేనప్పుడు ఇక్కడికి నేనెందుకు రావాలని అన్నారు. అనంతరం పట్టణంలోని మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేస్తున్న ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. స్కూల్ పరిధిలో సీసీ కెమెరాలు, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ బెన్ షాలోమ్ ఉన్నారు.

దళితబంధు దళారులకేనా?

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్

దుబ్బాకటౌన్: సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులు గొప్పగా చెప్పుకుంటున్న దళితబంధు పథకం దళారులకేనా అని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కొండపాక విజయ్‌కుమార్ ప్రశ్నించారు. బుధవారం దుబ్బాకలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలకతీతంగా దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే జిల్లాలోని దళిత కుటుంబాలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. దళితబంధు కేవలం అధికార పార్టీకే పరిమితం కావడం దారుణమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అనంతుల శ్రీనివాస్, నాయకులు మంద శ్రీనివాస్, గంధారి నరేందర్‌రెడ్డి, రేపాక తిరుపతి తదితరులు ఉన్నారు. అనంతరం దుబ్బాక నియోజకవర్గంలోని 5 మండలాల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులను నియమించారు. దుబ్బాక టౌన్ అధ్యక్షునిగా ఇస్తారిగల్ల మల్లేశం, దుబ్బాక మండల అధ్యక్షునిగా మిద్దె ప్రసాద్, భూంపల్లి అక్బర్‌పేట మండల అధ్యక్షునిగా కమటం మల్లేశం, తొగుట మండలానికి అంగాల కృష్ణ, దౌల్తాబాద్ మండలానికి బండారు లాలును నియమించారు.



నియామక పత్రం అందిస్తున్న విజయ్‌కుమార్

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

బెజ్జంకి(సిద్దిపేట): వ్యక్తిగత పరిశుభ్రతతో కండ్ల కలకను దూరం చేయవచ్చని కంటి వెలుగు జిల్లా టీం అధికారి శ్రీనాథ్ తెలిపారు. బుధవారం డీఎంహెచ్‌ఓ కాశీనాథ్ ఆదేశాల మేరకు బెజ్జంకి మండల కేంద్రంలోని హాస్టల్, పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, భద్రయ్య, మహేందర్, నసీంఉన్నిసా, సులోచన, అనిత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష తులసీ దళార్చన



సామూహిక తులసీదళ నామార్చనలో వేదవిద్యార్థులు



స్వామివారికి అర్చన

వర్గల్(గజ్వేల్): వర్గల్ విద్యాసరస్వతీ క్షేత్రంలోని శ్రీవేంకటేశ్వరాలయంలో బుధవారం శ్రవణ నక్షత్ర మహోత్సవ వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర సిద్ధాంతి పర్యవేక్షణలో వేదపండితులు శనగల నాగరాజుశర్మ బృందం తెల్లవారుజామున స్వామివారికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరునికి అలంకార సేవ చేశారు. ఓ వైపు నామార్చన కొనసాగుతుండగా వేదవిద్యార్థులు, భక్తజనులు స్వామివారికి లక్ష తులసీ దళాలు సమర్పించారు.

వైన్ షాపుల రిజర్వేషన్‌పై కసరత్తు

నేడు కలెక్టరేట్‌లో డ్రా

- 2023-2025కి గాను వైన్ షాప్‌ల కేటాయింపునకు నోటిఫికేషన్ జారీ
- 4 నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
- 21న షాప్‌ల కేటాయింపు కోసం లక్కీ డ్రా

సాక్షి, సిద్దిపేట: 2023-2025కి గాను మద్యం దుకాణాల కేటాయింపు కోసం జిల్లా ఎక్సైజ్ అధికారులు కసరత్తు ప్రారంభించారు. మద్యం షాప్‌లకు సంబంధించి బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా 93 వైన్ షాప్‌లుండగా ఐదు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ల వారీగా సిద్దిపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 24, గజ్వేల్ పరిధిలో 26, చేర్యాలలో 16, హుస్నాబాద్‌లో 16, మిరుదొడ్డిలో 11 ఉన్నాయి.

ఏ షాప్‌కు.. ఏ రిజర్వేషన్

జిల్లాలో ఉన్న వైన్ షాప్‌లకు రిజర్వేషన్ కేటాయింపు కోసం నేడు(గురువారం) ఉదయం 10.30గంటలకు కలెక్టరేట్‌లో కలెక్టర్ నేతృత్వంలో డ్రా తీయనున్నారు. 93 వైన్ షాప్‌లుండగా రిజర్వేషన్‌లలో ఎస్సీలకు 9, గౌడలకు 16 షాప్‌లను కేటాయించగా, 68 షాప్‌లు ఓపెన్ కేటగిరిలో ఉండనున్నాయి.

రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

సిద్దిపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో స్టేషన్‌ల వారీగా కౌంటర్‌లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తుతోపాటు రూ.2లక్షల బ్యాంక్ డీడీని జతపరిచి అందించాలి. ఈ నెల 4వ తేదీ నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. 21న సిద్దిపేటలో లక్కీ డ్రా ద్వారా షాప్‌లను కేటాయించనున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఎక్సైజ్ సీఐలతో సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి సమావేశం నిర్వహించారు.



గతంలో దరఖాస్తులు ఇలా..			
సంవత్సరం	షాప్‌ల సంఖ్య	దరఖాస్తులు	ఆదాయం
2021	93	1,702	రూ.34.04 కోట్లు
2019	70	1,336	రూ.26.72 కోట్లు
2016	69	1,044	రూ.10.44 కోట్లు

క్లుప్తంగా

ఎండు గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



హవేళీఘనపూర్: ఎండు గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పట్టుకొని వారి వద్ద నుంచి బైక్, 1.4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు మెదక్ టాస్క్‌ఫోర్స్ సీఐ నరేందర్‌గౌడ్ తెలిపారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం నెర్లెళ్లకు చెందిన దరావత్ జవహర్‌సింగ్, దరావత్ శ్రీనివాస్ బైక్‌పై 1.4 కిలోల గంజాయి తీసుకెళ్తుండగా ప ట్టు కొని వారి వద్ద నుంచి సెల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించనున్నట్టు వివరించారు.

జీవితంపై విరక్తితో వృద్ధురాలి ఆత్మహత్య

శివ్వంపేట(నర్సాపూర్): కడుపున పుట్టిన పిల్లలు సరిగా చూసుకోకపోవడంతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తడంతో వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఈసంఘటన మండల పరిధిలోని దొంతిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి పిట్ల స్వరూప (65) అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తుంది. ఈమెకు కూతురు, కొడుకు ఉన్నారు. వారికి పెళ్లిళ్లు అయి స్థిరపడ్డారు. కొన్ని నెలలుగా వారు సక్రమంగా చూసుకోవడం లేదు. దీనికి తోడు స్వరూపకు అనారోగ్య సమస్యలు తలెత్తాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం సాయత్రం ఇంట్లో నుంచి వెళ్లి గ్రామ శివారులో ఉన్న మాసానికుంటలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

తొగుట(దుబ్బాక): బైక్ అదుపుతప్పి కిందపడి ఒకరు తీవ్రంగా గాయపడ్డాడు. మిరుదొడ్డి మండలం చెప్యాలకు చెందిన యాదగిరి బైక్‌పై గజ్వేల్ నుంచి చెప్యాలకు వెళ్తుండగా వెంకట్రావుపేట గ్రామ శివారులో అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు



మాట్లాడుతున్న ఎస్పీ రమణ కుమార్

సంగారెడ్డిటౌన్: జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఎస్పీ రమణ కుమార్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీ య పార్టీల ప్రతినిధులు, అధికారులతో నిర్వహించి న సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నిక ల్లో ఏర్పాటు చేసినట్టుగానే ఈసారి కూడా పటిష్టమై న బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అవసరమైన చోట అదనపు బలగాలను ఏర్పాటు చేస్తామన్నారు. అదనపు కలెక్టర్ మాధురి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,594 పోలింగ్ కేంద్రాలు ప్రతిపాదించామన్నారు. ఈసందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రస్తావించిన పలు అంశాలపై ఎస్పీ, అదనపు కలెక్టర్, డీఆర్‌ఓ అవగాహన కల్పిస్తూ సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ అశోక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

108 సేవలు.. మరింత వేగం



సిద్దిపేటకు కేటాయించిన నూతన 108 వాహనాలతో సిబ్బంది



ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కృషితో సిద్దిపేట జిల్లాకు అత్యాధునిక టెక్నాలజీతో పాటు రోగికి తక్షణ వైద్య సదుపాయాలు అందించే పరికరాలతో కూడిన 15 నూతన వాహనాలు కేటాయించారు. 8- 108 వాహనాలు, 6- 102, అత్యవసర సేవలు అందించే వాహనం ఒకటి కేటాయించారు. దీంతో నూతన వాటితో కలిపి మొత్తం 29 వాహనాల ద్వారా జిల్లాలో మెరుగైన సేవలు అందనున్నాయి. అత్యవసర సమయంలో రోగికి సరైన వైద్యం అందించడంలో 108 కీలకంగా వ్యవహరిస్తున్నాయి. అలాగే గర్భిణులను వైద్య పరీక్షల నిమిత్తం ఇంటి నుంచి ఆస్పత్రికి.. డెలివరీ అనంతరం బాలింతలను ఆస్పత్రి నుంచి ఇంటికి చేరవేయడానికి 102ను వినియోగిస్తున్నారు.

– సిద్దిపేటకమాన్

- సిద్దిపేట జిల్లాకు 15 నూతన వాహనాల కేటాయింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న వైద్య సిబ్బంది, ప్రజలు

మొత్తం 29 వాహనాలు

సిద్దిపేట జిల్లాకు 15 నూతన వాహనాలు కేటాయించారు. జిల్లాలో ప్రస్తుతం (16) 108 వాహనాల ద్వారా సేవలు అందిస్తున్నారు. సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రెండు, హుస్నాబాద్‌లో రెండు, గజ్వేల్‌లో రెండు, ములుగు 01, జగదేవ్‌పూర్ 01, దౌల్తాబాద్ 01, దుబ్బాక 01, భూంపల్లి చిట్టాపూర్ 01, చిన్నకోడూర్ 01, కొండపాక 01, చేర్యాల 01, నంగునూర్ 01, బెజ్జంకిలో ఒక వాహనం ద్వారా సిబ్బంది సేవలు అందిస్తున్నారు. అయితే వీటిలో మరమ్మతుల స్థితిలో ఉన్న ఆరు వాహనాల స్థానంలో కొత్త వాటితో పాటు రెండు నూతన వాహనాలు కేటాయించారు. నూతన వాహనాలను గుర్రాలగొంది, కోహెడ ప్రాంతాలకు కేటాయించారు. అదేవిదంగా ఎనిమిది 102 (అమ్మ ఒడి) వాహనాలు ఉండగా వీటిలో మరమ్మతుల స్థితిలో ఉన్న ఆరు వాహనాల స్థానంలో కొత్తవి కేటాయించారు. 102 వాహనాలు సిద్దిపేటలో మూడు, గజ్వేల్‌లో రెండు, చేర్యాల 01, దుబ్బాక 01, హుస్నాబాద్ 01 వాహనాల ద్వారా గర్భిణులు, బాలింతలకు సేవలు అందిస్తున్నాయి. వీటితో పాటు జిల్లాలో రెండు పోస్ట్ సర్వీస్ సేవలు అందించే వాహనాలు (పార్థివదేహాలు తరలించే వాహనం) రెండు ఉండగా ఇవి గజ్వేల్‌లో ఒకటి, సిద్దిపేటలో ఒకటి సేవలు అందిస్తున్నాయి. వీటికి మరో నూతన ఎఫ్‌హెచ్‌ఎస్ వాహనాన్ని సిద్దిపే టకు కేటాయించారు.

95 మంది సిబ్బంది

మొత్తం 29 వాహనాల ద్వారా జిల్లావ్యాప్తంగా సేవలు అందించనున్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 95 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో 41 మంది పైలెట్లు, 36 మంది ఈఎంటీ, 18 మంది ఇతర సిబ్బంది సహాయకులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. మరో నలుగురు సిబ్బందిని నియామకం చేసుకోవాల్సి ఉందని వైద్యాధికారులు చెబుతున్నారు. కొత్త వాహనాల కేటాయింపుపై జిల్లా వైద్యాధికారులు, సిబ్బంది, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెరుగైన సేవలు

ప్రస్తుతం ఉన్న 108, 102 వాహనాలకు అదనంగా నూతన వాహనాలు కేటాయించారు. ప్రస్తుతం 29 వాహనాల ద్వారా జిల్లాలో సేవలు అందిస్తాం. గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయి. జిల్లా ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకోవాలి.



– కాశీనాథ్, డీఎంహెచ్ఓ, సిద్దిపేట

శివ్వంపేటలో దొంగల హల్‌చల్

- నగల దుకాణంలో చోరీ.. ఏటీఎంలో విఫలయత్నం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఓ నగల దుకాణంలో చోరీకి పాల్పడడంతో పాటు దొంతిలోని ఏటీఎంలో చోరీకి విఫలయత్నం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. శివ్వంపేటలో తూప్రాన్- నర్సాపూర్ ప్రధాన రోడ్డు పక్కన రాజస్థాన్‌కు చెందిన సత్యనారాయణ దుకాణం అద్దెకు తీసుకుని బంగారు నగల దుకాణం, పాన్ బ్రోకర్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. రోజువారీగానే మంగళవారం రాత్రి దుకాణానికి తాళం వేసి వెళ్లాడు. అర్ధరాత్రి గడ్డపారతో షట్టర్‌ను పైకి లేపి లోనికి ప్రవేశించిన దొంగలు 20 తులాల వెండి ఆభరణాలు, పలు రోల్డ్‌గోల్డ్ వస్తువులు, 3,500 నగదు దొంగిలించారు. గ్రహించిన చుట్టుపక్కల వారు లేచి వారిని పట్టుకోవడానికి ప్రయత్నించగా రాళ్లతో ఎదురుదాడి చేసి పరారయ్యారు. చోరీ ఘటన దుకాణంలోని సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఐదుగురు యువకులు ముఖానికి మాస్క్‌లు ధరించి ఉన్నారు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం సిబ్బంది ఆధారాలు సేకరించారు. అలాగే మండలంలోని దొంతి గ్రామ పరిధిలో తూప్రాన్- నర్సాపూర్ ప్రధాన రహదారి పక్కన మూతపడి ఉన్న ఆంధ్రాబ్యాంకు ఏటీఎంలో దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. ఏటీఎం లోనికి ప్రవేశించిన దొంగలు అందులో డబ్బులు లేవని గ్రహించి వెళ్లిపోయారు. ఘటనపై బ్యాంకు మేనేజర్ సూర్యం శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఏటీఎంను సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపారు. తూప్రాన్ సీఐ శ్రీధర్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

ఉద్యోగం దొరకడం లేదని..

- మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



ఉపేందర్‌రెడ్డి(ఫైల్)



బావిలో నుంచి మృతదేహాన్ని తీస్తున్న దృశ్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): ఉన్నత చదువులు చదివినా ఉద్యోగం దొరకడం లేదు.. తోటి స్నేహితులు ఉద్యోగం చేస్తున్నారని మనస్తాపం చెందిన యువకుడు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈసంఘటన మండల పరిధిలోని విఠలాపూర్‌లో మంగళవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎడ్ల వెంకటలక్ష్మి, లక్ష్మారెడ్డి దంపతులకు ఇద్దరు కుమారులు. వీరు వ్యవసాయం చేస్తూ కుమారులను ఉన్నత చదువులు చదివించారు. పెద్ద కుమారుడు ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా, చిన్నకుమారుడు ఉపేందర్‌రెడ్డి (25) బీటెక్ పూర్తి చేశాడు. ఏడాదిగా ఉద్యోగం కోసం అన్వేషిస్తున్నాడు. ఉద్యోగం రాకపోవడం.. తోటి స్నేహితులు ఉద్యోగం చేస్తున్నారని సన్నిహితులతో చెబుతూ ఉండేవాడు. ఈ క్రమంలో అదే గ్రామంలో ఉంటున్న తన మేనమామ తిరుపతిరెడ్డి వ్యవసాయ బావి వద్ద మోటారు మరమ్మతుల కోసం ఆయనతో కలిసి వెళ్లాడు. పని ముగించుకొని తిరుపతిరెడ్డి ఇంటికి రాగా.. ఉపేందర్‌రెడ్డి రాత్రి వరకు ఇంటికి రాలేదు. దీంతో రాత్రి తన మామ వాళ్ల ఇంట్లోనే ఉన్నాడని కుటుంబీకులు భావించారు. బుధవారం ఉదయం తిరుపతిరెడ్డి వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా గట్టుపైన ఉపేందర్ సెల్‌ఫోన్, డ్రెస్ ఉండడంతో కుటుంబీకులకు సమాచారం అందించాడు. బావిలో వెతకగా మృతదేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సుభాశ్‌గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. కొడుకు మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి..

- ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి



సిరాజ్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మండల పరిధిలోని సుల్తాన్‌పూర్‌కు చెందిన ఎండీ. సిరాజ్ (32) బీరంగూడ సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. మంగళవారం స్నేహితులు షబ్బీర్, నజీర్‌తో కలిసి అమీన్‌పూర్ పరిధిలోని జానకంపేట, వడక్‌పల్లిలో మద్యం సేవించాడు. అనంతరం వడక్‌పల్లి సమీపంలో గల నల్ల చెరువులో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతిచెందాడు. స్నేహితుల ద్వారా సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

పటాన్‌చెరుటౌన్: సైబర్ వలలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పడి డబ్బులు పోగొట్టుకున్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చిన వాట్సాప్ మెసేజ్‌లకు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రూ. 5 లక్షల 75 వేలు, మరో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ. లక్షా 18 వేలు పోగొట్టుకున్నారు. ఈసంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అమీన్‌పూర్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి జూలై 28వ తేదీన వాట్సాప్‌కు పార్ట్ టైం జాబ్ లింక్ వచ్చింది. దీంతో బాధితురాలు తన వివరాలు నమోదు చేసింది. కొంత నగదు ఇన్వెస్ట్ చేస్తే టాస్క్‌లు ఇస్తామని.. పూర్తి చేస్తే పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇస్తామని ఆశ చూపారు. పలు దఫాలుగా రూ. ఐదు లక్షల 75 వేలు వేసింది. ఇంకా నగదు జమ చేయాలని అడగడంతో అనుమానం వచ్చిన ఉద్యోగి తాను ఇన్వెస్ట్ చేసిన నగదు వెనక్కి ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో మోసపోయినట్టు గుర్తించి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే అమీన్‌పూర్ సిద్ధార్థ ఎన్‌క్లేవ్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి జూలై 30వ తేదీన పార్ట్ టైం ఉద్యోగం పేరిట మెసేజ్ వచ్చింది. స్పందించిన ఉద్యోగి తన వివరాలు నమోదు చేసి పలు దఫాలుగా రూ. లక్షా 18 వేలు ఇన్వెస్ట్ చేశాడు. తీరా తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందన రాలేదు. దీంతో బాధితుడు మోసపోయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇద్దరి ఫిర్యాదులపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆశ చూపి దోచేస్తున్నారు

- సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో రూ. 4 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు



సిద్దిపేటకమాన్: తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం, ఉద్యోగాలు, ప్రకటనల పేరుతో వివిధ రకాలుగా ఆశ చూపుతూ సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో డబ్బులు దోచుకుంటున్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు వివిధ రకాలుగా ఆన్‌లైన్ మోసానికి గురై రూ.4,06,059 పోగొట్టుకున్నారు. సీపీ శ్వేత బుధవారం వివరాలు వెల్లడించారు.

లాభాలు వస్తాయని..

సిద్దిపేట వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి టెలిగ్రామ్ యాప్‌లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని ప్రకటన చూశాడు. అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేయగా ఒక టాస్క్‌లో భాగంగా 35 ప్రొడక్ట్‌లలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని గుర్తు తెలియని వ్యక్తి తెలిపాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు ఆన్‌లైన్‌లో వారం రోజుల నుంచి పలు దఫాలుగా రూ. 3,23,028 పంపించాడు. తర్వాత ఆ లింకు ఓపెన్ చేయగా బ్లాక్ చేసి ఉండడంతో అనుమానంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన బాధితుడు పంపిన ఖాతాలో ఉన్న మొత్తం డబ్బులను సీజ్ చేశారు.

లోన్ యాప్ పేరుతో..

గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో అరోరా లోన్ యాప్ ద్వారా లోన్ తీసుకుని నెల రోజుల్లోపు మొత్తం డబ్బులు చెల్లించాడు. తర్వాత గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బాధితుడి ఫొటోలను న్యూడ్ ఫొటోలుగా ఎడిట్ చేసి వాట్సాప్‌కు పంపి వాటిని డిలిట్ చేయాలంటే డబ్బులు పంపాలని బెదిరించాడు. బాధితుడు రూ. 6,500 ఆన్‌లైన్‌లో పంపించాడు. తర్వాత ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో అనుమానంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయగా రూ. 6,500 ఫ్రీజ్ చేశారు.

ఆన్‌లైన్ ఆర్డర్ పేరుతో..

సిద్దిపేట టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి రెండు ఎల్‌ఈడీ బోర్డుల కోసం ఆన్‌లైన్‌లో రూ. 25 వేలు చెల్లించి ఆర్డర్ చేశాడు. పది రోజుల తర్వాత కూడా వస్తువులు రాకపోవడంతో డబ్బులు పంపిన నంబర్‌కు ఫోన్ చేయగా స్పందన రాలేదు. అనుమానంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

ఉద్యోగం పేరిట

చేర్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌కు ఉద్యోగం ఉందంటూ వచ్చిన మెసెజ్‌కు స్పందించి ఆ నంబర్‌కు ఫోన్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తి సూచించిన విధంగా అన్ని వివరాలు నమోదు చేసిన తర్వాత డబ్బులు చెల్లించాలని తెలపగా బాధితుడు ఆన్‌లైన్‌లో రూ. 3,100 పంపించాడు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్పందించకపోవడంతో జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

ఫేస్‌బుక్‌లో ప్రకటన చూసి

చేర్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ఫేస్‌బుక్‌లో బైక్ అమ్మకానికి ఉందనే ప్రకటన చూసి అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తి పంపిన బైక్ ఫొటోలు చూసి ఆశపడి అతడు సూచించిన విధంగా ఆన్‌లైన్‌లో రూ. 48,431 పంపించాడు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో బాధితుడు పంపిన ఖాతాలో ఉన్న రూ. 14,734 ఫ్రీజ్ చేసినట్టు పోలీసు అధికారులు తెలిపారు.

అటవీ కళాశాల సందర్శన



కళాశాలలో మ్యూజియంను తిలకిస్తున్న బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్

ములుగు(గజ్వేల్): హైదరాబాద్‌లోని బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్, పొలిటికల్ ఎకనామిక్ అడ్వైజర్ నళిని రఘురామన్ బుధవారం సిద్దిపేట జిల్లా ములుగు అటవీ కళాశాల, పరిశోధన కేంద్రం(ఎఫ్‌సీఆర్‌ఐ)ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు కళాశాలలోని విద్య, పరిశోధన విస్తరణకు సంబంధించి ఫారెస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ రంగాలలో సంభావ్య సహకారం గురించి కళాశాల డీన్, సీఎం కార్యాలయ ఓఎస్‌డీ ప్రియాంకవర్గీస్, అధ్యాపకులతో చర్చించారు. యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లో చదవడానికి అవకాశాలు, ఫెలోషిపులు, స్కాలర్‌షిప్‌ల గురించి వారు విద్యార్థుల ఇంటరాక్షన్ సెషన్‌లో చర్చించారు. అనంతరం కళాశాలలోని ప్రయోగశాలలు, మ్యూజియంను సందర్శించారు. కళాశాల జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి



మహిపాల్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మహిపాల్ చికిత్స పొందుతూ మృతిచెందారు. సంగారెడ్డి పట్టణం బాబానగర్‌కు చెందిన మహిపాల్ సివిల్ కానిస్టేబుల్ 2002 బ్యాచ్‌కు చెందిన వ్యక్తి. పటాన్‌చెరు పట్టణం చైతన్య నగర్ కాలనీలో ఉంటూ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఇతని భార్య స్వరూప నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఏప్రిల్‌లో హెడ్ కానిస్టేబుల్ ట్రైనింగ్ కు వెళ్లి, ట్రైనింగ్ పూర్తి చేసుకొని వచ్చిన మహిపాల్ అనారోగ్యానికి గురయ్యారు. దీంతో గచ్చిబౌలి సమీపంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. పట్టణ సీఐ లాలూ నాయక్, ఎస్ఐలు, సిబ్బంది కానిస్టేబుల్ మహిపాల్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కానిస్టేబుల్ మహిపాల్ మృతి తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.


వేర్వేరు చోట్ల ఐదుగురి అదృశ్యం

వేర్వేరు చోట్ల ఐదుగురు అదృశ్యమయ్యారు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో నలుగురు.. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో మహిళ అదృశ్యమైంది.

ఆస్పత్రికి వెళ్తున్నానని..

పటాన్‌చెరుటౌన్: ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వివాహిత అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రామేశ్వరం బండ వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన రమీజా బేగం కూతురు యాస్మిన్ బేగం (20) జూలై 31 తేదీన ఇంటి నుంచి ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పి తిరిగిరాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురు అదృశ్యంపై బుధవారం తల్లి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బయటకు వెళ్లి..



సాయికుమార్

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు పట్టణంలోని జేపీ కాలనీకి చెందిన సాయి కుమార్ (28) క్యాబ్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో ఈనెల 1వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన సాయికుమార్ తిరిగి రాలేదు. భార్య ఫోన్ చేసి చూడగా స్విచ్‌ఆఫ్ అని వచ్చింది. దీంతో తెలిసిన, వారు బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త అదృశ్యంపై భార్య మానస ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్‌కు వెళ్తున్నానని..



శ్రీనివాస్

మార్కెట్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడ నేతాజీనగర్‌కు చెందిన శ్రీనివాస్ (25) పటాన్‌చెరు మార్కెట్ యార్డులో హమాలీగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో జూలై 30వ తేదీన ఉదయం మార్కెట్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. భర్త కోసం లావణ్య తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మార్కెట్‌కు వెళ్లి ఆరా తీయగా వచ్చి వెళ్లిపోయాడని చెప్పారు. దీంతో భర్త అదృశ్యంపై బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

డ్యూటీకి వెళ్తున్నానని..



శాంతకుమార్

డ్యూటీకి వెళ్తున్నానని వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఈసంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణంలోని గౌతమ్‌నగర్ కాలనీకి చెందిన రమేశ్ తన బావమరిది ఉప్పరి శాంతకుమార్ (23) కొంతకాలంగా ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈక్రమంలో ఈనెల ఒకటో తేదీన డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి తిరిగిరాలేదు. బావమరిది అదృశ్యంపై రమేశ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మతిస్థిమితం లేని మహిళ..



మీనా

దుబ్బాక: మతిస్థిమితం సరిగా లేని మహిళ అదృశ్యమైన సంఘటన దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాజీపేటలో బుధవారం జరిగింది. దుబ్బాక ఎస్‌ఐ గంగరాజు కథనం ప్రకారం.. ధర్మాజీపేటకు చెందిన బత్తుల లింగంకు నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు. తండ్రి లింగం చిన్న కూతురు మీనాతో కలిసి ఉంటున్నాడు. అయితే ఆరేళ్లుగా మీనా మానసిక పరిస్థితి సరిగా ఉండడం లేదు. మంగళవారం రాత్రి భోజనం చేసి పడుకుంది. బుధవారం తెల్లవారుజామున చూసేసరికి కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల వెతికినా మీనా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.